ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

కంపించిన భూమి

ముండ్లమూరు, వేంపాడులో భూ ప్రకంపనలు

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలో ముండ్లమూరు, వేంపాడు గ్రామాలలో భూప్రకంపనలు సంభవించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం 10.15 గంటల ప్రాంతంలో రెండు సెకండ్ల పాటు భూమి కంపించడంతో పలు ఇళ్లలోని వస్తువులు కింద పడిపోయాయి. భూకంప శబ్దంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి పరుగులు తీశారు. గత రెండు సంవత్సరాల నుండి భూ ప్రకంపనలు తరచూ సంభవించడంతో ప్రజలు ఏ నిమిషంలో ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారు. 2017 సంవత్సరంలో రెండు సార్లు భూ ప్రకంపనులు సంభవించగా, 2023 ఫిబ్రవరి 14వ తేదీ మరోసారి వచ్చాయి. ప్రస్తుత ముండ్లమూరు తహశీల్దార్ నయీమ్ అహమ్మద్ మాట్లాడుతూ తాను ఇక్కడ డీటీగా పనిచేసిన సమయంలో కూడా భూ ప్రకంపలు వచ్చాయని గుర్తు చేశారు. మండలంలో వాగులు, వంకలలో ఇసుక తరలించడం, ప్రకతి సిద్ధమైన వనరులను ఇష్టారాజ్యంగా నాశనం చేస్తుండటం వల్ల కూడా ఇలాంటి ప్రకతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.



వేమూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

రైతుల కష్టం వర్షార్పణం

'బాలినేని' చుట్టూ రాజకీయాలు

- అధిష్టానం పెద్దలపై ఆరోపణలతో మారిన పరిణామాలు
- జిల్లాలో సమీకరణల్లో భారీ మార్పులుంటాయనే ఊహాగానాలు
- సోషల్‌మీడియాలో ప్రచారాలపై నేతల్లోనూ గందరగోళం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అధిష్టానంలో కొందరు నన్ను కావాలనే టార్గెట్ చేశారని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపించిన నేపథ్యంలో జిల్లాలో భవిష్యత్‌లో రాజకీయాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై ఊహాగానాలు పెరిగాయి. రానున్న కాలంలో అనేక మార్పులు దిశగా రాజకీయాల్లో పరిణామాలుంటాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. వైసిపి క్యాడర్‌లోనే ఈ ప్రచారం తీవ్రమైంది. సీనియర్ నేత బాలినేని ఆవేదన చెందినట్లుగానే సొంతపార్టీ నేతలే తనపై లేనిపోని ప్రచారాలు చేస్తున్నారన్నారు. వాస్తవంగా కూడా ఇదే జరుగుతోంది. వైసిపి నాయకుల్లోనే గందరగోళం నెలకొంది. ఆ పార్టీ నుంచే బాలినేనిపై ఇప్పటికీ ప్రచారాలు వేగం చేశారు.

బాలినేని సొంత పార్టీలోనే ఉంటారా? లేదా?అనే చర్చ ఇతర పార్టీల్లో పెద్దగా లేకపోయినా వైసిపిలోనే ఎక్కువగా సాగుతోంది. మీడియా సమావేశంలో బాలినేని భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టడం చర్చగా మారింది. ఇక్కడే ఆయన పరిస్థితి వైసిపిలో ఎలా ఉందనే దానిపైనా విశ్లేషణలు సాగుతున్నాయి. ఏదో జరుగుతోందన్న చర్చలతో పాటు ఊహాగానాలు పెరిగాయి. ఈ పరిణామాలు వైసిపిలో సంక్షోభానికి అద్దం పడుతున్నాయి. బాలినేని వైసిపిలోనే ఉంటారా? లేదా? ఆయన ఇతర పార్టీలతో టచ్‌లో ఉన్నారా? జనసేనతోనూ సంబంధాలున్నాయా? అనే చర్చలు వైసిపి వర్గాల్లోనే జరుగుతున్నాయి. ఇవన్నీ జిల్లా రాజకీయాల్లోనూ ప్రభావం చూపే అవకాశాలు కూడా లేకపోలేదు. అటు తెలుగు దేశం నేతలు కూడా జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. నియోజకవర్గాల్లోనూ రాజకీయంగా అనిశ్చితి నెలకొంది. మరో వైపు బాలినేని వ్యాఖ్యలపై దృష్టి సారించిన పెద్దలు ఒంగోలు డిఎస్పీ విషయంలో ఆయనకు అనుకూలంగానే నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఇక్కడ బాలినేని తన పంతం నెగ్గించుకున్నారనే చర్చ సాగుతోంది.

బాలినేని మీడియా సమావేశం తర్వాత రాజకీయ చర్చే వేరుగా ఉంది. తన ద్వారా టిక్కెట్లు పొందిన వారు కూడా తనపై సిఎంకు ఫిర్యాదులు చేస్తున్నారని బాలినేని చెప్పడం కూడా ఇక్కడ నేతల మధ్య ఉన్న అంతరాలను విదితం చేస్తోంది. బాలినేనికి.. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల మధ్య కూడా అధిష్టానంలో కీలక నేతలు దూరం పెంచారా? అనేదీ స్పష్టంగా చర్చ సాగుతోంది. నియోజకవర్గాల్లో అసమ్మతి నేతలు కొందరు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. అటు టిక్కెట్లు పొందిన నేతలూ, ఇటు అసమ్మతి నేతలూ ఇద్దరూ బాలినేని అండతోనే ▶ 2లో

నీటిని తొలగించి
టన్నెల్ పనులు ప్రారంభించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- 'వెలిగొండ' టన్నెల్‌లోని వరద నీటిని పరిశీలించిన మంత్రి సురేష్



వెలిగొండలో నిలిచిన వరదనీటిని పరిశీలిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలిగొండ ప్రాజెక్టులోని టన్నెల్‌లోకి ప్రవేశించిన నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించి వెంటనే రెండో టన్నెల్ తవ్వకం పనులు ప్రారంభించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం పెద్దదోర్నాల మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న వెలుగొండ ప్రాజెక్టు సొరంగాల్లోకి చేరిన వరద నీటిని అధికారులతో కలిసి పరిశీలించారు. వరద నీరు వచ్చి చేరిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఎనిమిది మోటర్ల ద్వారా వరద నీటిని బయటకు పంపుతున్నట్లు చెప్పారు. మరో ఎనిమిది మోటర్లను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో నీటిని పూర్తిగా తొలగించే ఏర్పాటు చేస్తామన్నారు. నీరు చేరడం మూలంగా సొరంగ మార్గంలో విద్యుత్ ప్రసారం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన రెండు రోజుల్లో తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి నాలుగు, ఐదు రోజుల్లోనే యుద్ధ ప్రాతిపదికన సొరంగం తవ్వకం పనులు ప్రారంభిస్తారని చెప్పారు.

త్వరలో మంత్రి రాంబాబు పరిశీలన

వెలిగొండ సొరంగం మార్గంలోకి వచ్చి చేరిన వరద నీటి విషయంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి సురేష్ తెలిపారు. త్వరలోనే ఆయన కూడా వెలుగొండ ప్రాజెక్టు సొరంగ మార్గాన్ని పరిశీలిస్తారని చెప్పారు. అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి.. వెలిగొండ ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈఈ అబుతాలీం, నాయకులు షేక్ అబ్దుల్ మజీద్, అమ్మిరెడ్డి రామిరెడ్డి, ఘంటా వెంకట రమణారెడ్డి, ఘంటా గురువారెడ్డి, సన్నిధి కిశోర్ కిరణ్ కుమార్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడిన భారీ చెట్లు
- నిలిచిన రాకపోకలు
- అంధకారంలో కాలనీలు



గిద్దలూరులో రోడ్డుకు అడ్డంగా పడిన చింత చెట్టు

ప్రకాశం జిల్లాలోని పలు చోట్ల ఆదివారం సాయంత్రం గాలివాన భీభత్సం సృష్టించింది. పలు చోట్ల భారీ చెట్లు రోడ్డుపై పడటంతో రాకపోకలు స్తంభించాయి. గిద్దలూరులో హైవేపై భారీ చింతచెట్టు పడటంతో 1.5 కిలోమీటర్లు వాహన రాకపోకలు స్తంభించాయి. భారీవర్షం కారణంగా చీమకుర్తిలో అంధకారం నెలకొంది.

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో గిద్దలూరు మండలం, కష్ణంశెట్టిపల్లి-గిద్దలూరు పట్టణం మధ్యలో స్వదేశీ ఫుడ్ కోర్టు వద్ద పెద్ద చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగిపడింది. దీంతో జగనన్న కాలనీ దగ్గర నుండి గిద్దలూరు సగిలేరు బ్రిడ్జి వరకు 1.5 కిలోమీటర్లు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చాలాసేపటి తర్వాత అధికారులు క్రేన్ల సహాయంతో రోడ్డుపై చెట్లు తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

అంధకారంలో చీమకుర్తి

చీమకుర్తి: చీమకుర్తిలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు కురిసిన భారీ వర్షం వల్ల విద్యుత్తుకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షంతో కూడిన ఈదురు గాలుల వల్ల విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. రోడ్ల మీద చెట్లు విరిగిపడ్డాయి. బైపాస్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా చెట్లు పడటంతో మున్సిపాలిటీ వారు జెసిబి సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను సరి చేశారు. వర్షం వల్ల మురికి కాలువలు, వాగులు పారాయి. మండలంలో విద్యుత్తు సాయంత్రం నాలుగు గంటల నుండి పూర్తిగా నిలిచిపోయింది. కరెంటు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

బాలినేని చుట్టూ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

తొలి నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. వీరిలో కొందరిని అధిష్టానం పెద్దలు బాలినేనిపై ఉసిగొల్పారా? ఆయన్ను టార్గెట్ చేసేందుకు వీరిని ఉపయోగించుకున్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా బాలినేని చుట్టూనే అనేక రకాలుగా రాజకీయ ఊహాగానాలు సాగుతున్నాయి. సోషల్‌మీడియాలో ప్రచారాలు తారాస్థాయికి చేరాయి. జిల్లాలో సీనియర్ వైసిపి నేతలు పార్టీ వీడతారనే పోస్టింగులు పెడుతున్నారు. వీటిల్లో ఏది వాస్తవం? ఏది అవాస్తవం? అన్న దానిపై స్పష్టత లేకపోయినా ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు ఈ ప్రచారాలు అద్దం పడుతున్నాయి. బాలినేని తన భవితవ్యంపైనా తర్జనభర్జన పడుతున్నారు. అధిష్టానంలో కీలక నేతలు తనకు అనుకూలంగా లేరని ఆయనే స్పష్టంగా చెప్పారు. ఈ పరిస్థితుల్లో వాటిని ఎలా అధిగమిస్తారు? అన్నదీ సందిగ్ధంగానే ఉంది. పార్టీలో ఆయన అంతర్యుద్ధం చేయాల్సి ఉంది. మంత్రి పదవి ఎవరి వల్ల పోయిందో కూడా ఆయన స్పష్టంగానే చెబుతున్నారు. అవన్నీ అందరికీ తెలిసినవేనంటున్నారు. మీడియాతో చెప్పకపోయినా తన ఈ పరిస్థితికి కారణం ఎవరో ఆయన పార్టీలో తన అనుచరులకు స్పష్టంగా చెబుతున్నారు. తన బంధువులే తనకు వ్యతిరేకంగా మారారని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో బాలినేని భవితవ్యం ఏమిటనే దానిపైనా వైసిపిలోనే పలు రకాలుగా చర్చలు సాగుతున్నాయి. కొందరు పార్టీ మారుతున్నారనే ప్రచారం కూడా మొదలుపెట్టేశారు. ఇంకొందరు ఉంటారని, పార్టీ వీడబోరని చెబుతున్నారు. ఇలా అస్పష్టమైన ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఈ ప్రచారాలు అన్నీ కుట్రతోనే సాగుతున్నాయని బాలినేని అంటున్నారు. ఇక నియోజకవర్గాల్లో బాలినేనికి ఎవరు అండగా ఉంటారు? ఎవరు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు? అనేదీ చర్చ సాగుతోంది. బాలినేకి అండగా కొందరు స్పందిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు ఇంకా పెదవి విప్పలేదు. ఆయనకు అండగా ఉంటే అధిష్టానం పెద్దల నుంచి ఇబ్బందులు వస్తాయనే ఆలోచనలో ఉన్నారు. టిక్కెట్లపై ఇప్పటికే స్పష్టత లేదు. ఇలాంటి సంక్షోభాల్లో తలదూర్చితే భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న ఆందోళన కూడా నేతల్లో ఉంది. బాలినేని పార్టీలో కీలక నేతలపైనే ఆరోపణలు చేసినందున ఇప్పుడు జిల్లా నేతలు అందరూ మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం బాలినేని వ్యూహం ఏమిటనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. పార్టీలో ఆయనకు జరుగుతున్న అన్యాయం, ప్రాధాన్యతలపైనే స్పందించారు. తన పరిస్థితి ఎలా ఉందో చెబుతూ ఆవేదన చెందారు. ఆయన కోసం తపించే క్యాడర్‌లోనూ అదే ఉద్రేకం పెరిగేలా చేశారు. ఏదేమైనా ఈ పరిణామాలు జిల్లా రాజకీయాల్లో ఉత్కంఠ చర్చకు దారితీస్తున్నాయి.



మాట్లాడుతున్న దివాకర్ దత్తు

సమ్మర్ క్యాంపు సందర్శన

ప్రజాశక్తి- అద్దంకి

జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సజన సాహిత్య సంస్థ అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్ దత్తు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండరంగని పద్యశాసనం మన గడ్డ మీదనే పుట్టిందని తెలిపారు. కవిత్రయం లో ఒకరైన ఎర్రన కవి మన నేల మీద నడచారని తెలిపారు. తెలుగు భాషా ప్రాధాన్యత వివరించారు. తెలుగు భాషా అంతరించిపోతున్న తరుణంలో దాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో సజన సంస్థ కార్యదర్శి అనిల్ కుమార్ సూరి, ఉపాధ్యక్షుడు సాయి, ప్రచార కార్యదర్శి లేవి ప్రసాద్, మహమ్మద్ రఫీ, సమ్మర్ క్యాంపు నిర్వహకులు, జెవివి డివిజన్ అద్దంకి అధ్యక్షుడు తంగా శ్రీనివాసరావు, హోమియో వైద్యుడు డాక్టర్ కావురి రఘుచంద్, పోస్టుమాస్టర్ రాఘవరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కొత్తపట్నం


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

మండల పరిధిలోని మడనూరు అంబేద్కర్ నగర్‌లో శ్రీ సీతా రామ లక్ష్మణ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసురెడ్డి పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడనూరు గ్రామానికి చెందిన లింగారెడ్డి శంభు ప్రసాద్ రెడ్డి,వారి ధర్మపత్ని కౌసల్యమ్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యకమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రారెడ్డి, వీరారెడ్డి, ప్రమోద్ రెడ్డి, గ్రామ సర్పంచి కోటేశ్వరరావు, చక్రవర్తి, తమలపాకుల రవీంద్ర, సచివాలయ కన్వీనర్ రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వినతి పత్రాలు అందజేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తున్నట్లు రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య తెలిపారు. పసుపు పంటను సాగు చేసిన రైతులందరూ తమ పరిధిలోని గ్రామ గ్రామ సచివలయాల్లో వినతి పత్రాలు అందజేయాలని ఆయన కోరారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పసుపు తడిచి రంగుమారినట్లు తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయక పోవడం బాధకరమన్నారు. పసుపును క్వింటా రూ.10 వంతున కొనుగోలు చేయాలన్నారు.

24 గంటలూ వైద్యసేవలు : డిసిహెచ్‌ఎస్

పర్చూరు : పర్చూరు ప్రభుత్వాసుపత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శేషు కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆదివారం సందర్శించారు.నీ సందర్భంగా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ గురుమహేశ్వరరెడ్డి, వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో ఎక్సరే పరికరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 10 నుంచి వైద్యశాలలో పోస్టుమార్టం సేవలు ప్రారంభిస్తున్నట్లు శేషుకుమార్ వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ సునీత, డాక్టర్ అరుణకుమార్, డాక్టర్ సుకన్య, డాక్టర్ సింధు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- కొండపి


కరాటే లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో మన ఊరి విద్యా వికాసం సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం కరాటే, తైక్వాండోలో శిక్షణను ప్రారంభించినట్లు నిర్యాహకుడు ధర్మవరపు అజయ్ తెలిపారు. ప్రతి ఏడాది తమ సోదరుడు ఎన్‌ఆర్‌ఐ ధర్మవరపు ప్రసాదు సహకారంతో కీర్తి శేషులు ధర్మవరపు వెంకటరంగయ్య, వరమ్మ జ్ఞాపకార్థం కరాటే, తైక్వాండోలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ తైక్వాండో శిక్షకుడు మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మార్షల్ విద్య వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం మరియు ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని తెలిపారు.

దేవరపల్లి ఆవుకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-పర్చూరు

అఖిల భారత ఒంగోలు పుంగనూరు ఆవుజాతి ప్రదర్శనలో పర్చూరు మండలం దేవరపల్లికి చెందిన ఆవు నాలుగు పళ్ల విభాగంలో ప్రథమ బహుమతిని సాధించింది. ఏలూరు జిల్లా మండవల్లి మండలం కొనకల్లు గ్రామంలో నిర్వహించిన గోజాతి ప్రదర్శనలు నిర్వహించారు. బహుమతి సాధించిన ముప్పాళ్ళ నిత్యశ్రీకి రూ. 14 వేలు బహుమతి అందజేశారు. పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు జి.నెహ్రుబాబు వసంత సంబరాల నిర్వాహక సంఘం అధ్యక్షులు పి.సత్యనారాయణ బహుమతిని అందజేశారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

పిఎన్‌సిఎ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో పిఎన్‌సిఎ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి తెలిపారు. బిఎస్‌సి(ఎంఎ ఎస్‌సి)లో 100 శాతం, బిఎస్‌సి(ఎంపీసీ)లో 100 శాతం, బిఎస్‌సి (బిజడ్‌సి)లో 100శాతం, బిఎస్‌సి(అగ్రికల్చర్)లో 100శాతం, బిఎలో 100శాతం, బిసిఎలో 93శాతం, బికాం (కంప్యూటర్స్)ల 92శాతం, బిఎస్‌సి (ఎంపిసిస్)లో75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. స్టాటిస్టిక్స్‌లో మంజుభార్గవి, వి.ప్రదీప్ కుమార్, వై .దీక్షిత్ కుమార్ నూటికి 100 శాతం మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.శ్రీనివాస రావు, ప్రిన్సిపల్ డి.నాగేశ్వరరావు అధ్యాపకులు ప్రసాద్, పల్లవి, వెంకట్రావు, శివ, మాబూ, శ్రీకాంత్, రాము అభిందించారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -శింగరాయకొండ


పద్మశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపల్

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. పద్మశ్రీ 588 మార్కులు, త్రిలోకేష్, మధులిక 587 మార్కులు సాధించారు. 580 మార్కులపైగా ఏడుగురు, 500కు పైగా మార్కులు 55 మంది సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. లక్ష్మణ్, అకాడమిక్ డీన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ హనుమంతరావు

విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సులను ఎంపిక చేసుకుని ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని మండల పరిధిలోని గంగవరం హనుమంతరావు హైస్కూల్ కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు మొత్తం 28 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ పాస్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. నల్లూరి కీర్తిశ్రీ 571, మంగపాటి ధనలక్ష్మి 570, మద్దిరాల హన్సిక 566 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యామల నరేంద్ర, ఉపాధ్యాయులు ఎల్.బ్రహ్మయ్య, పి.ఆంజనేయులు, కె.నాగేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హుండీలు పగులగొట్టి నగదు చోరీ

ప్రజాశక్తి-దొనకొండ

మండలంలోని చందవరం గ్రామంలోని అంకాల పరమేశ్వరి, పోలేరమ్మ ఆలయాల్లోని హుండీలు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ యం.సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం... అంకాల పరమేశ్వరి, పోలేరమ్మ ఆలయాల్లోని హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని నగదు దోచుకున్నారు. ఖాళీ హుండీలను సుమారు 2 కిమీ దూరంలో చిల్ల చెట్లలో పడవేశారు. మార్కాపురం క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు.

పౌరుషానికి ప్రతీక 'కాటమరాజు'

- 10న విగ్రహావిష్కరణ
- శర వేగంగా పనులు

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆంధ్ర రాష్ట్రంలోని వీరగాథల్లో కాటమరాజుల చరిత్ర గొప్పది. కాటమరాజు జీవిత చరిత్ర పౌరుషానికి, పరాక్రమానికి, ధైర్యసహసాలకు ప్రతీకగా నిలిచింది. కాటమరాజు చరిత్ర ప్రతి నోటా ఏదో సందర్భంగా బయటపడుతూనే ఉంది. కాటమరాజు తల్లిదండ్రులు పెద్దమ్మ, పెద్దిరాజు.

చరిత్రలోని ఆధారాల ప్రకారం కాటంరాజు క్రీస్తు శకం 1217లో కాటమరాజు జన్మించాడు. 1283లో మరణించాడు. ఆయన సతీమణి మర్లవారిగంగ. ఆమెను వీరగంగ అని కూడా పిలుస్తారు. వీరి పూర్వీకులు యలమంచిలి ప్రాంతంలో నివశించేవారు. వీరు గోవుల వెంట సరించినందున పల్లవులు అని అంటారు. కాటమరాజుకు 77 బిరుదులు ఉన్నట్లు తంగిరాల వేంకటసుబ్బరావు రాసిన కాటమరాజు కథ పుస్తకంలో ఉంది. కాటమరాజుకు గొప్ప ఆవులమంద ఉన్నట్లు తెలుస్తోంది. ఆనాటి ఆర్థిక వ్యవస్థకు పశుసంపదే ప్రధాన ఆధారం. కాటమరాజు యలమంచిల ప్రాంతానికి చెందిన వలురాజు వంశీకులు. వలురాజుకు మంత్రిగా పల్లికొండ ఉండేవారు. కాటమరాజు తాతకు సింహాద్రిరాజు,పెద్దిరాజు, యరనూకరాజు, నలనూకరాజు, పోలురాజు అనే ఐదుగురు కుమార్తైలతో పాటు కొమరక్క అనే కుమార్తె కూడా ఉంది. పెద్దిరాజుకు కాటమరాజు, పాపనూక అనే కుమార్తె ఉన్నారు. పెద్దిరాజు యలమంచిని 10 సంవత్సరాలు పాలించారు. అనంతరం సోదరులతో కలిసి పంపాద్రి చేరుకొని అక్కడ ఒక నగరాన్ని నిర్మించి ఏడు సంవత్సరాలు పాలించారు. కాటమరాజు పుట్టిన ఏడేళ్ళ తరువాత వారి చెల్లెలు పాపనూక పుట్టిన ఏడు రోజులకే ఆర్లవెంట యుద్ధంలో పెద్దిరాజు చనిపోయాడు. ఏడు సంవత్సరాలకే పట్టాభిసేకం పొందిన కాటమరాజు తన తండ్రిని చంపిన వాలికేతిరాజుపై దండెత్తి అతన్ని సంహరించారు. సింహాద్రిరాజు, యరనూకరాజు, నలనూకరాజు కూడా కొన్ని ప్రాంతాలను పాలించేవారు వలురాజు కుమారుల్లో చివరివాడైన పోలురాజు కూడా మంచి వీరుడు. ఆయన భార్య సిరిదేవి. ఆయనకు భక్తిరన్న, ఐతమరాజు, ముమ్మయ్య అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. పోలురాజు చోళరాజులైన ముక్కంటి అనే వీరుడితో చెరుకూరి ప్రాంతం వద్ద హోరా హోరీగా యుద్ధం సాగింది. అనంతరం పోలురాజు మరణించారు.

యాదవరాజు కథల్లో బొల్లావు కథ కూడా ఒకటి. పోలురాజు చనిపోయిన తరువాత ఆయన భార్య, పిల్లలందరూ యలమంచిలకు తిరిగి వెళ్ళిపోతుండగా ముక్కంటిరాజు మనుమళ్ళు బల్లికురవ ప్రాంతంలో పోలురాజు కుమారులపై యుద్ధానికి వచ్చారు. అప్పుడు పల్లికొండయ్య ప్రార్ధనను మన్నించి శ్రీహరి (మహావిష్ణువు) ఒంటికొమ్ము బొల్లావును యుద్ధరంగంలోకి పంపాడు. ఆబొల్లావు ముక్కంటి సైన్యాన్ని చెల్లాచెదరం చేసింది. ఆ యుద్ధంలో మారినీడు, మసినీడు అనే సైనికులు చనిపోయారు. అనంతరం పోలురాజు భార్య, పిల్లలు క్షేమంగా పంపాద్రి చేరారు. అనంతరం కాటమరాజు, పాపనూక కళ్యాణ పట్టణంలో ముదిరాజుల ఇంట పెరిగారు. చివరకు యలమంచికి వెళ్ళి గోసంపదతో పట్టాభిషేకం జరిగింది. అక్కడి నుంచి పశువులను మేపుకుంటూ పద్మనాయుడును ప్రధానిగా నియమించు కొని శ్రీశైలం వచ్చారు. అనంతరం దొనకొండ చేరారు. దొనకొండ వద్ద కాటమరాజు చెల్లెలు పాపనూకకు ఏకశిలా భవనం ఏర్పాటు చేసి ఆమెను అక్కడే ఉంచారు. ఆమెకు వివాహం కూడా లేదు. అక్కడ కరువు తాండవించడంతో నెల్లూరు మనుసిద్ధిరాజ్యంలో గోవులను మేపుకొనేందుకు పుల్లరి చెల్లించే షరతుతో బయలు దేరారు. వీరి ఇంటి ఇలవేల్పు అయిన గంగమ్మను తోచిపుచ్చి వెళ్ళేందుకు ప్రయత్నించారు. నేటి పిసిపల్లి మండలం పాలేరునదిలో గంగమ్మ వీరి గోవులు వెళ్ళకుండా రకరకాలుగా అడ్డంగించింది. పాలేటి నదిలోని గుండు ఎక్కి నీళ్ళలోనికి దూకడం, ఒక్కోక్క సారి నీళ్ళు లేకుండా చేయడం, ఇలా కాటమరాజు గోవులను వెళ్ళనివ్వకుండా అడ్డగించింది. చివరకు గంగమ్మ మట్టి పెయ్యిని తన గుండుక్రింద కన్నెకల మడుగు, దేవకన్య, నాగకన్య మడుగుల క్రింద దాచింది. దీన్ని గమనించిన కాటమరాజు గంగమ్మను అక్కడ ప్రతిష్టించి గంగమ్మ దీవెనలతోటి నెల్లూరు వైపు గోవులను తోలుకొని వెళ్ళాడు. అక్కడ మనోసిద్ధి భార్య కుందమాదేవి, చిలకలు గోవులు గడ్డి తినకుండా భయభ్రాంతులకు గురి చేసేవి. గోవు కాపలదారులు చిలకలను చంపడంతో కుందుమాదేవి ఆగ్రహించి గోవులను హత్య చేయించి నష్టపరిచింది. దీంతో కాటమరాజు వెనుదిరిగి వచ్చారు. వీరు చాకలికొండ సమీపానికి చేరేటప్పటికీ కప్పం చెల్లించాలని తిక్కననను రాయబారిగా పంపించారు. తాము గోవులను నష్టపోయామని, కప్పం చెల్లించాల్సిన అవసరం లేదని కాటమరాజు చెప్పాడు. పిసిపల్లి మండలం యర్రగడ్డపాడు వద్ద వీరి మధ్య భీకర పోరు జరిగింది. సల్లావారి జగడం, బొల్లావుల జగడం, భీర్‌నీరు జగడం, పర్యావుల రాజు యుద్ధం, బాలరాజు యుద్ధం, ఆవుల ఎద్దుల జగడం, కాటంరాజు యుద్ధం అని ఏడు యుద్ధాలు జరిగాయి. వీటిలో 7వ రోజు నల్లసిద్ధిరాజు సైన్యంతో కాటమరాజు యుద్ధం చేశారు. చివరకు కాటమరాజు నల్లసిద్ధిని, పద్మరాఘవుడు భీమనను చంపాడు. యుద్ధంలో తగిలిన గాయాల కారణంగా కాటమరాజు కూడా చనిపోయారు.

ఎట్టకేలకు కాటమరాజు యుద్ధంలో యాదవులు విజయం సాధించారు. అప్పటి నుంచి పిసిపల్లి మండలం పాలేటినది సమీపంలో ప్రతి సంవత్సరం జేష్టమాసంలో పాడ్యమి నుంచి పంచమి వరకు అంగరంగ వైభవంగా యాదవులతోపాటు చుట్టు ప్రక్కల వారు కూడా భక్తి శ్రద్ధలతో తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలలల నుంచి కూడా ప్రజలు ఈ తిరునాళ్లకు వస్తుంటారు. ఈ విధంగా పాలేటి గంగమ్మ భగీరథ పాలేటిగంగమ్మ తిరునాళ్లగా ప్రసిద్ధికి కెక్కింది.కాటమరాజు ప్రతిష్టించిన తమ ఇలవేల్పు గంగమ్మ విగ్రహం నేటికీ కనిపిస్తోంది. అక్కడ ప్రజలు పొంగళ్ళు పెట్టుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. పౌరుషానికి ప్రతికగా నిలిచి వీరమరణం పొంది కాటమరాజును చరిత్ర గురించి కథలుగా చెప్పుకుంటారు.


కాటమరాజు (ఫైల్)


కాటమరాజు విగ్రహం కోసం చేస్తున్న ఏర్పాట్లు

శరవేగంగా విగ్రహ ఏర్పాట్లు

కాటమరాజు విగ్రహం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని పంచలింగాల కొండ సమీపంలోనున్న పాలేటిగంగమ్మ గుడి ఎదురుగా కాటమరాజు విగ్రహం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 6 నుంచి 10 వరకూ భగీరథ గంగాభవానీ తిరునాళ్ల వైభవంగా నిర్వస్తున్నారు. 9వ తేదీ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10న పొంగళలో తిరునాళ్ల ముగియనుంది. అదే రోజు కాటమరాజు విగ్రహాన్ని ఆవిష్కరించున్నారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, మేకల మాల్యాద్రి, మచ్చా మాలకొండయ్య, బొడ్డుబోయిన బ్రహ్మయ్య విగ్రహ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్నారు.


అల్లూరులో విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్తుత్యమ ఫలితాలు సాధించారు. అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి శీలత 585 మార్కులు సాధించింది. మొత్తం 75 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. అమ్మనబ్రోలు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 59 మందికి గాను 52 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐవి.తేజ 572 మార్కులు సాధించాడు. చేకూరపాడు హైస్కూల్‌లో 9 మందికి గానూ 8 మంది పాసైయ్యారు. బి.అపర్ణ 472 మార్కులు సాధించింది. నాగులుప్పలపాడు హైస్కూల్‌లో 63 మందికి గానూ 55 మంది పాసై య్యారు. డి.సాయిబాబా 581మార్కులు సాధించాడు. మద్దిరాలపాడులో 15 మందికిగానూ 13 మంది ఉత్తీర్ణులయ్యారు. బి.సుప్రియ 510 మార్కులు సాధిం చింది. మాచవరం హైస్కూల్‌లో 30 మందికిగానూ 25మంది పాసైయ్యారు. సిహెచ్.అమత 548 మార్కులు సాధించింది. తిమ్మసముద్రంలో 48 మందికి గానూ 35మంది పాసైయ్యారు. పి.యోగ భాహ్య 532 మార్కులు సాధించింది. వినోదరాయిని పాలెంలో 18 మందికి గానూ 13 మంది ఉత్తీర్ణుల య్యారు. వై.స్మతి 545 మార్కులు సాధించింది. పోతవరంలో 24 మందికి గానూ 17మంది పాసైయ్యారు. పి. నక్షత్ర 491 మార్కులు సాధించింది. నిడమానూరులో 68మందికి గానూ 47 మంది పాసైయ్యారు. టి. అచ్యుత్ 518 మార్కులు సాధించాడు. కనపర్తిలో 33 మందికి గానూ 22 మంది పాసైయ్యారు. ఎస్. రాజేశ్వరి 530 మార్కులు సాధించింది. ఉప్పుగుండూరులో 63 మందికి గానూ 34 మంది ఉత్తీర్ణత సాధించారు. యు. అఖిల్ 519మార్కులు సాధించాడు. ఈదుమూడి హైస్కూల్‌లో 20 మందికి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. అభినయశ్రీ 555 మార్కులు సాధించింది. మండలంలో మొత్తం 750 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 622 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ మహబూబ్ సుభాని తెలిపారు . **కొత్తపట్నం :** పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ మైమూన్ 580 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మైమూన్‌ను ఎంఇఒ అజయ్‌బాబు, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు. మోటుమాలలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 252 మందికి గాను 206 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈతముక్కలలో 146 మందికి గాను 118 మంది పాసైయ్యారు. ఆలూరులో 22 మందికి గాను 19 మంది ఉత్తీర్ణత సాధించారు. అల్లూరులో 36 మందికి గాను 31 మంది ఉత్తీర్ణులైయ్యారు. గవండ్ల పాలెంలో 55 మంది విద్యార్థులకు గాను 50 మంది ఉత్తీర్ణత సాధించారు. మోటుమాలలో 20 మంది విద్యార్థులకు గాను 18 మందిఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నూరుశాతం ఉత్తీర్ణత


కార్తీక్

సంతనూతలపాడు రూరల్ : 10 తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక ఎపి గురుకుల పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 74 మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులైనారు. బి. కార్తీక్ 589, జె. అశోక్ 586, పి. శివరంగయ్య 583 మార్కులు సాధించాడు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ మెర్సీ, ఉపాధ్యాయులు అభినందించారు.

650 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్


రోగులకు పరీక్షిస్తున్న వైద్యులు

కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గిద్దలూరు బ్రహ్మానందరెడ్డి హాస్పిటల్,ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ళ,గర్భకోశ, మూత్ర సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మొత్తం 650 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, గిద్దలూరు బ్రహ్మానంద రెడ్డి హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి- మద్దిపాడు


కల్యాణ మహోత్సవంలో బూచేపల్లి

మండల పరిధిలోని మల్లవరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం ఆవారం రంగరంగ వైభవంగా నిర్వహించారు. జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ బూచేపల్లి శివప్రసాద రెడ్డి, టిడిపి యువ నాయకుడు దామాచర్ల సత్య, టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న దానం నిర్వహించారు, భక్తులకు మజ్జిగ, తాగునీరు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటయ ట్రస్టు బోర్డు చైర్మన్ నారా నాగిరెడ్డి. ఇఒ దామా నాగేశ్వరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వేటపాలెం

వివేకానంద కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్త కుండా పది రోజుల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి ఆదేశించారు. మండల పరిధిలోని వివేకానంద కాలనీ వాసులతో ఎమ్మెల్యే ఆదివారం ఆయన సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చోటు చేసకున్న లోపాలను సరిచేసి తక్షణమే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కనీస అవసరాలు తాగునీటిని, విద్యుత్ దీపాలు, ఇంటింటికీ విద్యుత్ కనెక్షన్లకు చొరవ చూపాలని అధికారులకు సూచించారు. గతంలో జరిగిన లోపాల గురించి ప్రస్తావన వద్దని ప్రస్తుతం ఏది జరగాలో ఏమి కావాలో వాటి గురించి మాత్రమే ఆలోచించి తగు చర్యలు చేపట్టే విధంగా కృషి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

డిఇ సతీష్ చంద్ర, పంచాయతీరాజ్ శాఖ డి.స్వర్ణ శేషయ్య, విద్యుత్ ఎడిఎ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎంవిఎస్.శర్మ, రెడ్డిపాలెం, పంచాయతీ కార్యదర్శి కొమ్మనబోయిన శివలీల, వేటపాలెం ఎస్‌జి. సురేష్, మాజీ సర్పంచి లేళ్ల శ్రీధర్, మాజీ ఎంపిపి చల్లా జనార్ధన్‌రావు పాల్గొన్నారు.


ప్రవళికను అభినందిస్తున్న అమ్మమ్మ శారమ్మ

ప్రవల్లికకు అభినందనలు

ప్రజాశక్తి-చీరాల

కృషి పట్టుదలే ఉన్నతికి సోపానం అని నిరూపించింది ఆ విద్యార్థిని. తల్లి దండ్రులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పేదరికం వెంటాడుతున్నప్పటికీ ఆ విద్యార్థిని తన ఏకాగ్రతను కోల్పోకుండా అధ్యాపకులను అనుసరిస్తూ చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివింది. పెరిరాస్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విజయనగర కాలనీకు చెందిన వంటరి ప్రవల్లిక పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 585 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా పెరిరాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుప్రసన్న మాట్లాడుతూ తమ విద్యార్థిని ప్రవళిక 585 మార్కులు సాధించడంతో తమకెంతో గర్వకారణం అన్నారు. మరో 4గురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన ప్రవళికను పాఠశాల ప్రిన్సిపల్ సుప్రసన్న, ఉపాధ్యాయులు, బంధువులు అభినందించారు.


చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

చిన్నారికి ఆశీర్వాదం

వేటపాలెం : వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని రావూరుపేటకు చెందిన గుత్తి సదాశివరావు, అనురాధ దంపతుల కుమార్తె హంసశ్రీ పుష్పాలంకరణ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్ పాల్గొని చిన్నారి హంసశ్రీని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గంగాధరరావు, పిచ్చుక భార్గవ్‌రామ్, అక్కల నాగార్జున రెడ్డి, దేవన బాబు రాజేంద్రప్రసాద్, పెయింటర్ శేషయ్య, సుబ్బారావు, మద్దాలి ఇజ్రాయిల్, శ్రీరామ్ గోవర్ధన్, పథ్వి వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, పింజల మోహన్ బాబు, గుత్తి ప్రభాకర్ రావు, నవీన్, ఖాదర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వీల్‌చైర్ బహూకరణ

రేపల్లె : అరుణశ్రీ వికలాంగుల సేవా సంఘానికి యలవర్తి కిరణ్ కుమార్, చైతన్య దంపతుల కుమారుడు సాంబ సదా శివలింగ వర ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన ఎలక్ట్రికల్ మొబైల్ వీల్‌చైర్‌ను ఆదివారం బహూకరించినట్లు జానం మురళీకష్ణ తెలిపారు. ఈ సందర్భంగా దాత కిరణ్ కుమార్ దంపతులను సంఘ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గాదె వెంకట కష్ణారావు ఉమామహేశ్వరరావు, రామకష్ణ, గౌతమ్ బుద్ధ, మధుసూధన రావు, శాసన పాములు, సాంబశివరావు, ఓబులేశ్వరరావు పాల్గొన్నారు.

కనీస వసతులు లేక..

- జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

జగనన్న కాలనీల్లో కనీస వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. రెండేళ్లుగా గహ నిర్మాణాలకు నీటి వసతి , రహదార్లు ఏర్పాటు కాలేదు. భట్టిప్రోలులో జగనన్న కాలనీకి 33 ఎకరాలు కేటాయించారు. నీటిని సరఫరా చేయడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో ఏర్పాటు చేసిన బోర్లు విఫమయ్యాయి. మండల పరిషత్ నిధుల ద్వారా చేపట్టిన పైపు లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయకుండా కాంట్రాక్టరు ఏడాదిన్నర పాటు కాలయాపన చేశాడు.ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పైపు లైను పూర్తి చేశారు. అయినప్పటికీ అందరికీ నీరు సరఫరా కావడం లేదు. పైనులైన్ నాసిరకంగా ఏర్పాటు చేయడంతో నీరు


ట్రాక్టర్‌పై కాలువలోని నీరు తెచ్చుకుంటున్న దృశ్యం

అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గృహ నిర్మాణాలకు మురుగు కాలువల్లోని నీటిని డమ్ముల ద్వారా ట్రాక్టర్లపై తెచ్చుకుంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకొని గృహ నిర్మాణాలు పూర్తి చేసుకొనేందుకు సహకరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పదవ తరగతి పరీక్షా ఫలితాలలోఅద్దేపల్లి సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పాఠశాల కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు తెలిపారు. కుందేటి అంజని 587 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ముగిసిన పరీక్షలు

ప్రజాశక్తి వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల కళాశాలో నీట్ (యు.జి) –2023 పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నీటి (యు.జి)–2023, నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (యు.జి)–2023 కళాశాలలో విజయవంతంగా ముగిసినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాల రావు తెలిపారు. నీట్ పపరీక్షకు 576 మందికి గాను 565 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు విజయంతంగా ముగిసినట్లు తెలిపారు. పరీక్షలకు వలి సాహెబ్, సిటి కో ఆర్డినేటర్, రాధా కుమారి, డాక్టర్ రాఘవయ్య అబ్జర్వర్లుగా వ్యవహరించారు. డాక్టర్ అనిల్ కుమార్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు.

10న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- అద్దంకి

మండలపరిధిలోని బొమ్మనంపాడు మండలపరిషత్ ప్రాథమిక పాఠ శాలలో ఈనెల 10న ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశిబిరం సమన్వయకర్త తాళ్ళూరి రామాంజనేయులు ఆదివారం తెలియజేశారు. ఈ వైద్యశిబిరంలో కంటి శుక్లాలు, పొరలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. బొమ్మనంపాడు, సమీప గ్రామాల ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాల కోసం 9492120399 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

మురుగునీటి పారుదలకు మోక్షం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత కొద్ది సంవత్సరాలుగా మార్టూరులో కొద్దిపాటి వర్షానికే ప్రధాన కూడళ్ళలలో భారీగా నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టోల్ ప్లాజాల ద్వారా ముక్కుపిండి రుసుం వసూలు చేసే అధికారులు గ్రామాల్లోని సైడ్ కాలువలు, సర్వీస్ రోడ్ల గురించి పట్టించుకోవడం లేదు. తమకెందుకనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. స్థానికులు సమస్య గురించి అనేక సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న ఫలితం కనిపించలేదు. మురుగునీరులోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్


మరమ్మతులకు ముందు రహదారిపై నిలిచిన నీరు


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

మార్టూరులో పర్యటించారు. ఆ సమయంలో స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న రోడ్డు అండర్‌పాస్ వద్ద కొద్దిపాటి వర్షానికి నీరు రోడ్డుపై నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపిస్తున్న దశ్యాన్ని స్వయంగా పరిశీలించి అవాక్కయ్యారు. ఈ విషయం గురించి పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. తమ పరిధిలోది కాదని జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదని ఆమంచి దష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆ మంచి అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడారు. సైడ్ కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో స్పందించిన అధికారులు ఆమంచి కష్ణమోహన్, ఉమ్మడి జిల్లా జడ్‌పి వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, సుందర్‌రావు సమక్షంలో ఆదివారం సైడ్ కాలువలు శుభ్రం చేయించారు. మురుగునీరు పోయే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి- సంతమాగులూరు

అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్క జొన్నలను రైతులు విక్రయించు కొనేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎఒ లావణ్య తెలిపారు. మండల పరిధిలోని ఏల్చూరు గ్రామ రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆదివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో 3,161 ఎకరాలలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసినట్లు తెలిపారు. ఈ పాటికే 2,278 ఎకరాల్లోని పంట ఉత్పత్తిని రైతులు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారన్నారు. మిగిలిన 883 ఎకరాల మొక్కజొన్న పంటకు రైతు భరోసా కేంద్రాలల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. గత శనివారం నాటికి 200 ఎకరాల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ ఈనెల 13తో ముగుస్తుందన్నారు. రైతులందరూ, తమ ఆధార్, బ్యాంకు ఖాతా,


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ

పొలం పాసు పుస్తకం, తీసుకొని స్వయంగా (ఈ క్రాప్ లో నమోదైన వారు) ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ. 1,960 రూపాయలు ప్రకటించినట్లు తెలిపారు. మార్క్ ఫెడ్ ద్వారా గోతాలు సరఫరా చేస్తారన్నారు. రైతులు కనీస మద్దతు ధరకు మొక్కజొన్నలను అమ్ముకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రసన్న, గౌస్, సుమంతు,



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

సంజీవయ్యకు మంత్రి సురేష్ నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురష్కరించుకొని మార్కాపురంలోని జార్జి గెస్ట్‌హౌస్‌లో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ 38 సంవత్సరాల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తొలిసారి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టిన దళిత వ్యక్తి అని ప్రశంశించారు. నివాళులు అర్పించిన వారిలో మంత్రి సురేష్‌తో పాటు త్రిపురాంతకం ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చయ్య, పెద్దారవీడు మండల వైసిపి కన్వీనర్ పాలిరెడ్డి కష్ణారెడ్డి, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మార్కాపురం ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు దారివేముల బాబీ పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుజాత

కాంట్రాక్టర్ తప్పిదం వల్ల ప్రోటోకాల్ పాటించలేదు: మేయర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వేసవిలో ప్రజల కోసం నగరంలో నాలుగు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలలో సిఎం, మున్సిపల్ మంత్రి ఫొటోలు ప్రచురించలేదని, ఇది పూర్తిగా కాంట్రాక్టర్ తప్పిదమని నగర మేయర్ గంగాడ సుజాత వివరణ ఇచ్చారు. ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫ్లెక్సీలలో సిఎం, మున్సిపల్ మంత్రి ఫొటో లేకపోవడాన్ని గమనించిన అధికారులు గంట వ్యవధిలోనే తిరిగి సిఎం, మున్సిపల్ మంత్రి ఫొటోలను చేర్చి ఫ్లెక్సీలను ముద్రించడం జరిగిందని వివరించారు. జరిగిన పొరపాటు పూర్తిగా కాంట్రాక్టర్ అవగాహన లోపం కారణంగా జరిగిందన్నారు. జరిగిన పొరపాటుకు, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు (చిన్నారి), ఇమ్రాన్‌ఖాన్, యనమల నాగరాజు, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా జిల్లా అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షులు వి వాసు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ1 ఫంక్షన్ హాలు ఎదురు ఏర్పాటు చేయబోతున్న సీతారామరాజు విగ్రహ స్థలంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జూలై 4న సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలో సీతారామరాజు విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రావూరి బుజ్జి, ప్రభాస్ ఫ్యాన్స్ టౌన్ అధ్యక్షులు సిహెచ్ నాగరాజు, సుబ్బు, సాయి, కాపు యువసేన జిల్లా అధ్యక్షులు బండారు సురేష్, షణ్ముఖ, జానీ, రాజీవ్ గాంధీ, సాయి చందు, సతీష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం వ్యాపారుల సమస్యలను

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా..


- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- అట్టహాసంగా గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. వ్యాపారులకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బులియన్, గోల్డ్, సిల్వర్, డైమండ్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక ఎ1 ఫంక్షన్ హాలులో అట్టహాసంగా జరిగింది. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని వారిని అభినందించారు. నూతన కార్యకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి.. వారిని సత్కరించారు. వ్యాపారులు కూడా బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిల్‌వాయ్ విజయ్‌కుమార్, చీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్, ప్రధాన కార్యదర్శి బొమ్మిరెడ్డి శంకర్, ఒంగోలు సంఘం అధ్యక్షులు తాతా ప్రసాద్, కార్యదర్శి పేర్ రమేష్ కుమార్, చైర్మన్ దాసరి నారాయణరావు, స్పీకర్ గ్రంధి చెంచురామారావు, పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్య విగ్రహానికి నివాళి

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ప్రకాశం భవనం



బాలినేనిని సత్కరిస్తున్న బంగారం వ్యాపారులు

ఎదురుగా ఉన్న సంజీవయ్య విగ్రహానికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య దేశంలోనే అత్యంత పిన్నవయస్కుడైన ముఖ్యమంత్రి అని, వితంతువులు, వృద్ధులకు ఫింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టారని కొనియాడారు. సంజీవయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, యాదాల అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆయా మెడికల్ షాపు ప్రారంభం..

స్థానిక 60 అడుగుల రోడ్డులోని గుప్తాస్ స్క్వేయిర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆయా మెడికల్స్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, డాక్టర్ జివి కృష్ణయ్య, డాక్టర్ జాన్ రిచర్డ్స్, 49వ డివిజన్ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, వైసిపి నాయకులు వేమూరి మాల్యాద్రి, కొత్త శ్రీనివాసరెడ్డి, వడ్డెబోయిన అమర్నాథ్‌రెడ్డి, వెంకట్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

సిఐ, ఎస్ఐల సహకారం మరువలేనిది..

డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి

ప్రజాశక్తి-దరిశి

పోలీస్‌శాఖలో తనకు అన్నివిధాలుగా సహకరించి బాధ్యతలు సక్రమంగా నిర్వహించిన సిఐ, ఎస్ఐల సేవలు మరువలేనివని బదిలీపై వెళుతున్న దరిశి డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో స్థానిక సిఐ జె.రామకోటయ్య అధ్యక్షతన బదిలీపై ఒంగోలు వెళ్ళుతున్న డిఎస్‌పి వి నారాయణస్వామిరెడ్డి వీడ్కోలు సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిఐలు, ఎస్ఐలు, ప్రముఖులు నారాయణస్వామిరెడ్డి సేవలు కొనియాడారు. పోలీసుశాఖలో బదిలీలు వస్తుంటాయి, పోతుంటాయని బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన డిఎస్‌పిగా నారాయణస్వామిరెడ్డి నిలిచారని దరిశి సిఐ జె రామకోటయ్య, పొదిలి సిఐ రాఘవేంద్రలు కొనియాడారు. అనంతరం డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డిని ఘనంగా



డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డిని సత్కరిస్తున్న సిఐలు

సన్మానించారు. కార్యక్రమంలో సిఐలు పాపారావు, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసరావు, పాండురంగారావు, దరిశి ఎస్ఐ రామక్రిష్ణతో పాటు సబ్‌డివిజన్‌పరిధిలోని 18 మంది ఎస్ఐలు, పలువురు ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి పంపడమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-పామూరు

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే టిడిపి లక్ష్యమని కనిగిరి మాజీ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్రానికి ఇదేమి కర్మ అనే నినాదంతో వగ్గంపల్లి నుండి డివిపల్లి వరకు యారవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని, అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, షేక్ రహంతుల్లా, ఎం రమణయ్య, ముసలయ్య, శ్రీనివాసరెడ్డి, ఎస్.రమణారెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు, రత్తయ్య, రమేష్, బాలచంద్ర, హరి, రవి, మల్లిఖార్జున, మాధవ, వెంకటస్వామి, రవి, ప్రకాశం పాల్గొన్నారు.

వెలిగండ్ల: మండలంలోని రామలింగాపురంలో నూతన రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముక్కు ఉగ్రనరసిహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉగ్రనరసింహారెడ్డి

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం మొగుళ్ళూరులో రేణుకా యల్లమ్మ తల్లి కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వడ్లమూడి వెంకటరావు

వివిఆర్ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-ఒంగోలు

ఏఎన్‌యు యుజి ఒకటో సెమిస్టర్ ఫలితాలలో వివిఆర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చైర్మన్ వడ్లమూడి వెంకటరావు తెలిపారు. బికాం, బీఎస్సీ, బిసిఎలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. బికాం, బిసిఎలో 95 శాతం మంది, బిఎస్సీలో 92 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ వడ్లమూడి పద్మశ్రీ అభినందించారు.



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణులు

టిడిపి గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు పాటుపడాలని టిడిపి విశ్వ బ్రాహ్మణ సాధికారిక పార్లమెంటు స్థాయి సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశం ఆదివారం స్థానిక విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో జరిగింది. సమావేశానికి సంఘం ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు పిఎస్ బాబు అధ్యక్షత వహించారు. ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్ మంచాబాబు, దర్శి నియోజకవర్గం కన్వీనర్ తవ్వపాటి జనార్ధనాచారి పాల్గొన్నారు. సమావేశంలో సంఘ నాయకులు పొతకమూరి బాలసుబ్రహ్మణ్యం, నూతలపాటి ప్రసాద్, గోవిందాచారి, కీనల శ్రీనివాస్, అమరేశ్వరరావు, అరుణ్‌కుమార్, ఆలూరి వెంకటేష్ సాయి, కందేపి పాపారావు, నరసింహారావు, సుధాకర్, మారుతి, శేషబ్రహ్మం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సమీపంలోని దరిమడుగు గ్రామ పరిధిలోని 'ఇందిరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్'లో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఐసన్ ఎక్స్‌పీరియన్‌సెస్, టెక్ మహీంద్రా కంపెనీల ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను ఆ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి ప్రారంభించారు. పై కంపెనీల హెచ్‌ఆర్‌లు ఇ.దుర్గారావు, బి.శ్రీనివాస్‌లు బిటెక్, డిప్లమో చివరి సంవత్సర విద్యార్థులను రౌండ్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకోవడం జరిగింది. ఈ ఎంపికలో 75 మంది పాల్గొనగా అందులో 23 మంది ఐసన్ ఎక్స్‌పీరియన్‌సెసస్ కంపెనీలో, 11 మంది టెక్ మహీంద్రా కంపెనీలో ఉద్యోగాలు సాధించారు. ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎన్.గంగరాజు, విభాగాధిపతులు కె.సురేంద్రరెడ్డి, జె.సాయిబాబా, సి.పుష్పలత, కె.రాజశేఖర్, సత్యవాణి, షేక్ అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-దరిశి

ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు దరిశి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని గ్రం థపాలకురాలు ఎల్. సుమతి తెలిపారు. ఎంఇఒ కాకర్ల రఘు రామయ్య ఆదివారం వేసవి శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ వేసవిలో శిక్షణకు 6 నుండి 10వ తరగతి విద్యార్థులు హాజరై.. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



సభలో సందేశం ఇస్తున్న గాండ్ల హరిప్రసాదరావు

సామాజిక సమస్యలకు బౌద్ధంలో పరిష్కారం

ప్రజాశక్తి-కొండపి

భారత దేశంలో తరతరాలుగ ప్రజలను విడదీస్తూ వివక్షకు గురిచేస్తున్న సామాజిక సమస్యలకు బౌద్ధ ధర్మం శాశ్వత పరిష్కారం చూపిందని, అందుకే సామ్రాట్ అశోక్‌చక్రవర్తి మొదలు డాక్టర్ అంబేద్కర్ వరకూ బౌద్ధ ధర్మం స్వీకరించి సర్వ మానవ సంక్షేమానికి శాస్త్రీయమైన పునాది వేశారని ప్రముఖ బౌద్ధ ధర్మ ప్రచారకులు ఉపాసక గాండ్ల హరిప్రసాదు బోధి తెలిపారు. కొండపి అంబేద్కర్ నగర్‌లో జరిగిన బుద్ధ జయంతి సభలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత, మహిళలు కులమతాలకు అతీతంగా డాక్టర్ అంబేద్కర్ రచనలను, బౌద్ధ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసి అంబేద్కర్ కలలుకన్న ప్రభుద్ధ భారత్ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సింగరాయకొండ బుద్ధ విహారి ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉపాసక అల్లు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఐన్‌స్టీన్, కారల్ మార్క్స్ వంటి ప్రముఖులు బుద్ధుని బోధనలను ప్రశంసించారని, ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ లోతైన అధ్యయనం చేసి ప్రపంచ మతాలలోకెల్లా బౌద్ధధర్మం శ్రేష్ఠమైనదని తీర్మానం చేశారని అన్నారు. కార్యక్రమానికి ఆరోగ్య విస్తరణాదికారి జి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు ఉజ్వల్, కొండపి అంబేద్కర్ యూత్ సభ్యులు, సిహెచ్ వసంతరావు, కె.క్రాంతి, కొండపి ద్యాన కేంద్ర సభ్యులు టి.అశోక్, కె.అగ్గిరామయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు కోటపాటి లక్ష్మినరసింహం, గ్రామ ప్రపజలు, యువకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే స్వామి ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని జయవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కొల్లా రాఘవయ్య కుమారుడు వివాహం స్థానిక కొండపి రోడ్డులోని కామని కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య టంగుటూరుకు విచ్చేసి నూతన వధూవరులు కొల్లా అమర్ నాథ్ – బ్రహ్మ సాయి తేజశ్రీలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

సిద్ధవరంలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని సిద్ధవరం, చెర్లోపల్లి, ఎస్సీ కాలనీలు, చేరెడ్డివారిపల్లి గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి పాల్గొని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరిస్తూ లబ్ధిదారులతో ఆప్యాయంగా పలకరిస్తూ మమేకమయ్యారు. సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, సర్పంచి రావినూతల మరియమ్మ, ఇమ్మానియేలు, ఎంపిటిసి షేక్.మీరావలి, ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు బూదాల థామస్, రేగడపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు ఉన్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

శింగరాయకొండలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -శింగరాయకొండ

గ్రామ పంచాయతీ రిటైర్డ్ కార్యదర్శి షేక్ వలీ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని భారీ ఎత్తున రక్తదాన శిబిరాన్ని యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆ రక్తదాన శిబిరాన్ని సిఐటియు నాయకులు జి.శ్రీనివాసులు, టంగుటూరి రాము, నక్క శ్రీనివాసులు ప్రారంభించి.. రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొడ్డ కరుణాకర్ రెడ్డి, వైసిపి యువ నాయకులు దొడ్డ మహీధర్ రెడ్డి



వలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే స్వామి

షేక్ వలికి ఘన నివాళి



రక్తదాన శిబిరం వద్ద సిఐటియు నాయకులు

పాల్గొన్నారు. ఆదివారం రాత్రి కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి షేక్ వలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, షేక్ సంధాని భాష ,షేక్ అబ్దుల్ సుభాన్ ,షేక్ యస్ దాని, ఇమ్మడిశెట్టి రామారావు, పులి ప్రసాదు, షేక్ బచ్చే తదితరులు ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారీ ఎత్తున షేక్ వలి సంస్మరణ సభ నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్

ప్రజాశక్తి-పిసిపల్లి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెదఇర్లపాడు, దేశిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అత్యాల జఫన్య, ఎంపిటిసి చెరుకూరి సతీష్, సోసైటీ అధ్యక్షులు పోలు జయరామిరెడ్డి, జడ్‌పిటిసి లక్ష్మీకాంతంరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శీలం సుదర్శనం, వైసిపి యూత్ నాయకులు మేకల మాల్యాద్రి, మాజీ వైస్‌ఎంపిపి డబ్బుకొట్టు మహేష్‌నాగ్, ఆలూరు కొండారెడ్డి, ఎంపిటిసిలు మైలా రవణమ్మ, సర్పంచి పోలం గోవిందమ్మ, మడతల ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విఆర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దరిశి

పదోతరగతి ఫలితాలలో దరిశిలో తూర్పుగంగవరం రోడ్ లోని ఎస్‌విఆర్ హైస్కూల్ విద్యార్థి సిహెచ్.అక్షయ 583 మార్కులు, బి.కళ్యాణి 581 మార్కులు సాధించారు. 550 మార్కులకు పైగా 14 మంది, 500కు పైగా 27 మంది విద్యార్థులు మార్కులు సాధించగా డైరెక్టర్ సిహెచ్.సునీత విద్యార్థులను అభినందించారు.



అక్షయకు స్వీటు తినిపిస్తున్న ఎస్‌విఆర్ స్కూల్ డైరెక్టర్ సునీత

తాళ్ళూరులో శ్రీ సరస్వతి విద్యార్థులు పదోతరగతి పరీక్ష ఫలితాలలో ఆవుల లక్ష్మిశివకుమారి 587 మార్కులు సాధించి.. ప్రథమస్థానంలో నిలిచింది. కట్టా భార్గవి 579, ఎస్.రాగఅమృత 576 మార్కులు సాధించారు. విద్యార్థులను శ్రీసరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఎవి రమణారెడ్డి, డైరెక్టర్లు ఆవుల గణేష్‌రెడ్డి, ఆవుల గంగా శంకర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్ళూరులోని ఎబిసి స్కూల్‌లో టి.నిర్మల నివేదిత 582, ఎస్. చందన 581, ఎం. ప్రసన్నాంజనేయులు 580 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి అభినందించారు.

డిగ్రీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో..

'శ్రీగౌతమి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం ఒకటో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో యర్రగొండపాలెంనకు చెందిన శ్రీ గౌతమి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఒకటో బిఎస్సీ అగ్రికల్చర్‌లో 450 మార్కులకు గానూ 432 మార్కులతో మీర్జా నిషాత్ ఫాతిమా బేగం డివిజన్ ఫస్ట్ సాధించడంతో పాటు 409 మార్కులతో ముత్తు మణిమేఘల ద్వితీయస్థానం పొందింది. 407 మార్కులతో నుసుల్లపల్లి భావన జ్యోతి తతీయస్థానం కైవసం చేసుకుంది. 1వ బిఎస్సీ (బిజడ్‌సి) నందు 450 మార్కులకు గానూ 389 మార్కులతో మన్నం సంజయ్ కుమార్ డివిజన్ ఫస్ట్ సాధించాడు. 359 మార్కులతో చెన్నబోయిన అంజయ్య ద్వితీయ స్థానం, 345 మార్కులతో అన్నా హారిక తతీయ స్థానం పొందింది. 2వ బిఎస్సీ కంప్యూటర్‌లో 400 మార్కులకు గాను 384 మార్కులతో చిట్టి లక్ష్మి ప్రసన్న టౌన్ ఫస్ట్ సాధించడంతో పాటు 363 మార్కులతో చిరదల విజయ్ బాబు ద్వితీయ స్థానం, 360 మార్కులతో గుంటక నాగవేణి తతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఒకటో బికాం కంప్యూటర్స్ నందు 350 మార్కులకు గాను 280 మార్కులతో షేక్ సిరాజ్ ఉద్దీన్ మొదటి స్థానంతో పాటు 275 మార్కులతో చేతురాజుపల్లి ఆంజనేయులు ద్వితీయ స్థానం, 270 మార్కులతో దేశావత్ శ్రావణి బాయ్ తతీయ స్థానం సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ గౌతమి కళాశాలల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సవలం రవిబాబుతో పాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



చీరలు అందజేస్తున్న నాయకులు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఆర్యవైశ్య పేద మహిళలకు, పురుషులకు దాదాపు 150 మందికి చీరలు, పంచలు, టవల్స్ ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం దాతల సహకారంతో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆవోపా పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి రామశేఖర్ అన్నారు. దాతలైన దయాల్‌బాగ్ స్టోర్ యజమాని రామడుగు కష్ణ సంపత్‌ను, ఇతరులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ కన్వీనర్ సెక్రటరీ చీదెళ్ళ లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సూరే వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ఊటుకూరి మధుసూదన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాళ్ళ కోటి మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులను క్షేమంగా తీసుకురావాలి

కాంగ్రెస్ అధికార ప్రతినిధి సైదా

ప్రజాశక్తి-పొదిలి

అల్లర్లు, హత్యాకాండ, ఆస్తుల ధ్వంసంతో అట్టుడికిపోతున్న మణిపూర్ రాష్ట్రంలో చిక్కుకుపోయిన ఆంధ్రా విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి చేర్చేందుకు జగన్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిజెపి పాలనలో ఉన్న మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా లోపించి జరిగిన అల్లర్లు, విధ్వంస కాండలో ఇప్పటికే 70 మంది పైగా మతి చెందారన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా దేశ ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా కర్ణాటక ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉండటం రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేలు వాయించనట్లుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక విమానం ఏర్పాటుచేసి విద్యార్థులను క్షేమంగా చేర్చాలని డిమాండ్ చేశారు.

పోలేరమ్మ దేవాలయంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని కామేపల్లి గ్రామంలో శ్రీపోలేరమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు అమ్మవారి దర్శనానికి వేకువజాము నుంచి బారులు తీరారు. భక్తులు పొంగళ్లు పెట్టి.. శ్రీపోలేరమ్మ కు మెక్కులు తీర్చుకొని దర్శనం చేసుకున్నారు. దూబగుంటకు చెందిన వున్నం శ్రీనివాసులు కూడా శ్రీ పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి మెక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హాజరై.. వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. భక్తులకు దేవాలయ కార్యనిర్వాహణాదికారి శివకుమార్ వసతులు కల్పించారు.

గంగమ్మని దర్శించుకున్న ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-జరుగుమల్లి



ఆలయంలో స్వామి, సత్య

మండలంలోని నర్సింగోలు గ్రామంలో శ్రీ ముడుపుల గంగమ్మ, పోతురాజు, జీవధ్వజ స్తంభ, ఆలయ శిఖర ప్రతిష్టా మహెూత్సవం వేద పండితులు డాక్టర్ జంధ్యాల చంద్రభాస్కరశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. గంగమ్మ తల్లిని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనరు పోకూరి రవీంద్రబాబు, ఏలూరి రాంబాబు, కొండపి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణ, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోట్వేరరావు, మండల తెలుగు దేశం పార్టీ యూత్ అద్యక్షులు ఎనిమిరెడ్డి రమేష్ రెడ్డి, టిడిపి ప్రదాన కార్యదర్శి నరాల సోమయ్య, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, వట్టిగుంట శివాజి, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం భారీగా అన్న దానం కార్యక్రమం నిర్వహించారు.

వధూవరులకు డాక్టర్ వెంకయ్య ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కారుమంచి గ్రామం అంబేద్కర్ నగర్ లో గాలి వారి వివాహం ఆదివారం జరిగింది. పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, నీరుకొండ కన్ స్ట్రక్షన్స్ అధినేత శింగయ్య, టంగుటూరు వైసీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అద్దంకి

అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి నందమూరి కళాపరిషత్తు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి, ఠాగూర్ చిత్రపటాలకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ నాడు బ్రిటిష్ పాలకుల అరాచకుల అకత్యాలపై తిరుగుబాటుతో బ్రిటిష్ పాలకులకు తెలుగువాడి పౌరుషం విప్లవ భావాలతో గడగడ లాడించిన వీరుడు అల్లూరు సీతారామరాజు అని తెలిపారు. టిడిపి బాపట్ల పార్లమెంటరీ సాంస్కతి భాగం అధికార ప్రతినిధి, నందమూరి కళాపరిషత్ ఉపాధ్యక్షుడు చేబ్రోలు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నాడు గిరిజనులను అన్ని రకాలుగా హింసించే తెల్లవాడు దురాగతాలపై విప్లవ


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కెరటంలా విరుచుకుపడి తెలుగువాడి తెగింపుతో తెల్లవాడి పాలనను సాగనంపేందుకు గిరిజనులు తోడు చేసుకుని గెరిల్లా పోరాటాన్ని ఎంచుకొని పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి బాపట్ల పార్లమెంటరీ సాంస్కతిక భాగం అధ్యక్షులు, నందమూరి కళా పరిషత్ సభ్యుడు గోవాడ శ్రీకాంత్, టిడిపి అద్దంకి నియోజకవర్గ సాంస్కతిక భాగం అధ్యక్షుడు రావులపల్లి వెంకటరావు, సుధాకర్, హర్షవర్ధన్ పాల్గొన్నారు. .**సంతనూతలపాడు రూరల్ :** సంతనూతలపాడు గ్రంథాయలంలో గ్రంథపాలకుడు నిత్యకళ్యాణరావు ఆధ్వ ర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఎయిడ్ కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరేటి నరసింహారావు, గ్రామీణ వైద్యుడు ఏల్చూరి నరసింహారావు, దుంపా సాగర్, నూతలపాటి వెంకట్రావు, కుంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దామోదర సంజీవయ్యకు నివాళి

ప్రజాశక్తి- బాపట్ల

దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి బాపట్ల అంజుమన్ కమిటీ కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివద్ధికి ఐటిపిఎల్, ఇహెచ్ఇఎల్ రిశ్రమలు సంజీవయ్య హయాంలోనే నెలకొల్పినట్లు తెలిపారు. వ్యవసాయ అభివద్ధి కోసం గాజులదిన్నె, వంశధార ప్రాజెక్టులను నిర్మించినట్లు తెలిపారు. మానవ నిర్మిత మహాసాగరం నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఆనాటి బడ్జెట్లో రూ.77 కోట్లు కేటాయించిన ఘనత దామోదరం సంజీవయ్యకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా మైనార్టీ నాయకులు పటాన్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శీలం సాగర్, రాంబాబు, శంకర్, డి రవి, దండు రేణుక, కోన జయశాంతి, తాజుద్దీన్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

ప్రజాశక్తి బాపట్ల

సాహిత్యరంగంలో తొలినోబెల్ బహుతితో భారతదేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తంగా కీర్తింపజేసిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నేటి రేపటి తరాలకు ఆదర్శ ప్రాయులని ప్రముఖ కవి ప్రజా వైద్యులు డాక్టర్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి సాహితీ భారతీయ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఠాగూర్ శాంతినికేతన్ విశ్వ విద్యాలయాన్ని స్థాపించిన విద్యాప్రధాతగా ఖ్యాతిగాంచారన్నారు. ఆయన సేవలు అందరికీ స్ఫూర్తి దాయకమని తెలిపారు.

అక్షరాలకు పాటల పరిమళాలద్దిన ఆత్రేయ....

తెలుగు అక్షరాలకు పాటల పరిమళాలు అద్దిన మనసుకవి ఆత్రేయ చిరస్మరణీయులని సాహితీ భారతీ అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ తెలిపారు. ఆత్రేయ102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహ వర్మ మాట్లాడుతూ ఆత్రేయ నాలుగువందల పైచిలుకు చిత్రాలకు సంభాషణలు అందించారన్నారు. సుమారు 14వందల సినిమా పాటలు రచించారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీభారతి ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రి రావు, కార్యదర్శి ఆదం షఫీ, ఎం. జాకబ్, ఎన్.కష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి ,రెంటాల మురళి, రాధాకష్ణమూర్తి,అవ్వారి వెంకటేశ్వర్లు , ఆత్రేయ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

పజాశక్తి - రేపల్లె

రేపల్లె పట్టణంలో 13వ వార్డు వడ్డెర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కొంతమంది పెద్దలు కల్యాణమండపాన్ని నిర్మించాలని కోరినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యం కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్ట మంగా సుబ్బా రావు, వైసిపి పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకష్ణమూర్తి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి

ఆర్ఎంపి వైద్యులకు అవగాహన

ప్రజాశక్తి బాపట్ల రూరల్

శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ , చంద్ర న్యూరో కేర్ సెంటర్ గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో గ్రామీణ ప్రాథమిక వైద్యులకు న్యూరాలజీ, గుండె జబ్బులు, జ్వరాలు,షుగర్ వ్యాధి చికిత్సపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ తాడివలస దేవరాజు ,మహబూబ్ బేగ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ పక్షవాత లక్షణాలను మొదటి దశలో గుర్తిస్తే పక్షవాతం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు. పిట్స్ ఒక లక్షణమని దానికి అసలైన కారణానికి కనుక్కొని సరైన చికిత్స అందించాలన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ కొసరాజు కమలాకర్ మాట్లాడుతూ గుండె దడ గుండె నొప్పి వచ్చినప్పుడు వెంటనే ఇసిసి తీయించాలన్నారు. డాక్టర్ తులసీరామ్ మాట్లాడుతూ జ్వరం, లివర్, కిడ్నీకి వ్యాధుల లక్షణాలను గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా సరైన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఆర్ఎంపి బాపట్ల డివిజన్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ వెంకట్, మహబూబ్ బేగ్, సుధారాణి,సుబ్బారావు, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ జిఎం తాడివలస సురేష్, కసా మురళి ,రాజశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలోనున్న శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాళ స్వామి కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామి వారికి మాగులూరి వారు పట్టువస్త్రాలు సమకూర్చగా దేవస్థానం ఇఓ మీనిశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మిదేవి దంపతులు స్వామి వారికి సమర్పించారు ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, ఆలయ పూజారి దివి శ్రీధర్ బాబు,పేరాల చెన్నకేశవులు, కొంజేటి వెంకట సురేష్ బాబు, ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాదు, మాదాసు రాంబాబు, మాగులూరి శ్రీను, బెల్లం హరిబాబు, సిబ్బంది వేణు, సుబ్బారావు పాల్గొన్నారు అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు వివేకానంద సేవాసమితి ఆవిర్భావ అధ్యక్షుడు శంకరరావు ఆద్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసారు .


రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

వైభవంగా రథోత్సవం

శ్రీరుక్మిణి సత్యభామ శ్రీవేణుగోపాల స్వామి కళ్యాణం అనంతరం తెలగసంఘం ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు విచ్చేసి రథోత్సవాన్ని తిలకించారు.

నాగండ్లలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మండల పరిధిలోని నాంగండ్లలో రోటరీ ఆధ్వర్యంలో 499వ నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన గాలి సుబ్బారావు (66) మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జట్టి వెంకటేశ్వర్లు సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు విపిన్, వాణి నాగండ్ల వచ్చి సుబ్బారావు కార్నియాలను సేకరించారు. నేత్రదానికి సహకరించి సుబ్బారావు కుటుంబ సభ్యులు మరియమ్మ, రాజశేఖర్, ఏమేలమ్మ, సుభాషిణిని రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు అభినందించారు.


సుబ్బారావు (ఫైల్)

నేటి నుంచి వేసవిశిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కొండపి

స్థానిక శాఖా గ్రంథాయలంలో సోమవారం నంచి చిన్నారులకు వేసవి శిక్షణ తరగతలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. శిక్షణ తరగతుల్లో భాగంగా పుస్తక పఠనం, పాటలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయం నేటి నుంచి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకురాలు నాగరజని తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా పాటలు, చిత్రలేఖనం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇవ్వ నున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. **కొల్లూరు :** వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లూరు గ్రంథపాలకుడు రాంబాబు తెలిపారు. ఈనెల 8 నుంచి జూన్ 11 వరకూ విసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ థియేటర్ ఆర్ట్స్ తది సజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించన్నుట్లు తెలిపారు. విద్యార్థులు వేసవి శిబిరాలకు హాజరై సజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- అద్దంకి

శింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆదిపూడి మోహనరావు , ఉపాధ్యక్షులుగా పుట్టంరాజు సాయి, ముక్తినూతనపాడు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పమిడిఘంటం చంద్రశేఖర్, కోశాధికారిగా దేనువకొండ సుబ్బారావు,కార్యవర్గ సభ్యులుగా దామరాజు వేణు గోపాల్‌రావు , పోలంరాజు రమణరావు , ధర్మవరపు సీతా రామయ్య, మిన్నికంటి శ్రీరామమూర్తి, డి.సుబ్ర మణ్యం, కె.సుబ్బయ్య, పి.సత్యనారాయణ, వంగలహరి శంకరావధాని ఎన్నికయ్యారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-వేటపాలెం

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో చీరాల నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయటం ఖాయమని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు , మంగళగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల ఆయన మాట్లాడారు. చీరాల నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి తన వంతు కషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న చేనేత సామాజిక వర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

తీగలేరు ముంపుతో పంటలు నష్టపోతున్నాం

మంత్రి సురేష్ ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని తీగలేరు కాలువపై బ్రిడ్జిలు నిర్మించి వాగు నీటిని మళ్లించకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా తీగలేరు కాలువ ముంపుకు గురై సాగులో ఉన్న పంటలు నష్టపోతున్నామని మండలంలోని ఐనముక్కల గ్రామానికి చెందిన రైతులు ఆదివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముందు వాపోయారు. ఆదివారం వెలిగొండ ప్రాజెక్టు వద్ద నిలిచిన నీటిని పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు రైతులు తమ సమస్యలు విన్నవించారు. గత ఐదు సంవత్సరాలుగా పత్తి, మిర్చి, తదితర వాణిజ్య పంటలు వేయడం, ముంపు నీటితో నష్టపోవడం జరుగుతుందని కన్నీటి


మంత్రికి వివరిస్తున్న రైతులు

పర్యంతమయ్యారు. ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. స్పందించిన మంత్రి సురేష్ సమస్యను పరిష్కరించాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు..

గడపగడపకూ.. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-పెద్దారవీడు

సంక్షేమం... అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా పాలన సజావుగా ముందుకు తీసుకెళ్లారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఆదివారం పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలతో జరిగే లబ్ధి ప్రజలకు వివరించారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి, జెడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, సర్పంచ్ జిల్లెల మల్లీశ్వరి, డివిజన్ అభివద్ధి అధికారి సాయికుమార్, ఎంపిడిఓ


మాట్లాడుతున్న మంత్రి సురేష్

నాసరరెడ్డి, ఇన్‌చార్జి తహశీల్దార్ వేణుగోపాల్‌రావు, ఎలక్ట్రికల్ ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ శ్రావ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ సాంబశివయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు బెజవాడ నాగరాజు, మూల రమణారెడ్డి, బెజవాడ ఆదాం, మండల సోషల్ మీడియా కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్ర యాదవ్, మేకల కాశయ్య యాదవ్, ఉప్పలపాటి పెద్ద కాశయ్య, జిల్లెల గాలిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మార్కాపురం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తానెప్పుడూ ముందుంటానని విహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి చెప్పారు. ఈ నెల 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దక్షిణ కొరియాలో జరిగే మాస్టర్స్ గేమ్స్‌లో పాల్గొంటున్న మార్కాపురం పట్టణానికి చెందిన డోలా శ్యామలాదేవికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని విహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, ఆయన సతీమణి తర్లుపాడు జడ్‌పిటిసి వెన్నా ఇందిరలు అందించారు. ఈ సందర్భంగా డోలా శ్యామలాదేవి విజేతగా తిరిగిరావాలని, భారతదేశ ప్రతిష్టను ప్రపంచ పటంలో మరింతగా ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ జాతీయ మెగా లోక్ అదాలత్ గురించి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మే 13న శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో కోర్టు వారు ఇచ్చిన నివేదిక జిల్లా పరిధిలోని పోలీసు స్టేషన్‌లలో నమోదైన కేసుల నివేదిక రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులలో కక్షిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఇరుపక్షాల వారిలో మెగా లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించాలన్నారు. వారి సమ్మతితో కోర్టులో కేసులు పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.నోటీసులు అందిన కక్షిదారులు వారి కేసులను మెగా లోక్‌అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలన్నారు. సివిల్, కొన్ని క్రిమినల్, భార్యాభర్తల మధ్య అపరిష్కృతంగా కోర్టులలో ఉన్న కేసులలో ఉభయ పక్షాల వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారాలను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యక్షంగా సిబ్బందిని ఏర్పాటు చేసి మెగా లోక్‌అదాలత్ గురించి అవగాహన కలిపిస్తున్నామన్నారు. కావున కక్షిదారులు మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన మెగా లోక్ అదాలత్ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

రైతుల కష్టం వర్షార్పణం

అకాల వర్షాలతో 30 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నకు నష్టం


ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గత వారం రోజులుగా బాపట్ల జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతాంగం తాము ఆరుగాలం పండించిన పంటను నష్టపోయారు. జిల్లాలోని వేమూరు, రేపల్లే, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో మొక్కజొన్న, జొన్న, పసుపు, మిరప పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని పంగులూరు, చుండూరు ప్రాంత పొలాల్లో కండె వచ్చిన దశలో ఉన్న మొక్కజొన్న పంట దెబ్బతింది. మిగతా ప్రాంతాల్లో పోలాల్లో ఆరబెట్టి ఉన్న మొక్కజొన్న గింజలు, కండెలు వర్షాలకు తడిచి మొలకలు రావడం, ఫంగస్ సోకి బూజుపట్టి పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతాంగం తమని ఆదుకోవాలని కోరుతున్న నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు పంటనష్టం అంచనాలు చేపట్టారు. ప్రాథమిక నివేదిక మేరకు జిల్లాలో పొలాల్లో కండె వచ్చిన దశలో ఉన్న మొక్కజొన్న పంటకు సుమారు 3 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. దీంతో పాటు పొలాల్లో ఆరబెట్టి ఉన్న 9 వేల ఎకరాల్లోని మొక్కజొన్న, వెయ్యి ఎకరాల్లో జొన్న, 300 ఎకరాల్లో వేరుశెనగ పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తంగా చూస్తే వేసవి కాలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా సుమారు 15 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అంచనాగా ఉంది. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి కాగా అకాల వర్షాలతో 30 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట తడిచి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. కాగా జిల్లా మంత్రి వేమూరు నాగార్జున శుక్రవారం వేమూరు నియోజకవర్గంలో పంట పొలాలను పరిశీలించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ కూడా రేపల్లే ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం యడ్లపల్లి, పెనుగుదురుపాడు, వేటపాలెం గ్రామాలలో గత కొన్ని రోజుల నుండి యదేచ్ఛగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన పంట పొలాలను మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పరిశీలించారు. నష్టపోయిన రైతులను కలిసి పంటనష్టం గురించి తెలుసుకున్నారు. ఆనందబాబు మాట్లాడుతూ పంట నష్టపరిహారంపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదని, రైతులకు భరోసా ఇచ్చే నాథుడే లేకుండా పోయారని ఆరోపించారు. పంట నష్టం అంచనా వేసే దిక్కే లేదని, ప్రభుత్వం నుంచి సాయం అందే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారన్నారు. జిల్లాలో మొక్కజొన్న, జొన్న, దెబ్బతిన్నాయి, ప్రభుత్వం తప్పించుకోవడానికి కుంటి సాకులు చెబుతోందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కడ తెరిచారో చెప్పాలని, రైతు వద్ద ఆఖరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆనందబాబు డిమాండ్ చేశారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు, నాయకులు క్షేత్ర స్థాయిలో రైతులను కనీసం పట్టించుకోని పరిస్థితి కనపడుతోందన్నారు. రైతు దగ్గర తడిచిన, మొక్క వచ్చిన, రంగు మారిన పంటను ఆఖరి గింజ వరకు కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

జస్వంత్‌కుమార్‌కు 'బూచేపల్లి' అభినందన

ప్రజాశక్తి-దరిశి

పదోతరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే అత్యధికంగా 597 మార్కులు సాధించిన దరిశి కెజిజి విద్యార్థి ఊరుబిండి అజయ్ జస్వంత్ కుమార్‌ను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం పుష్పగుచ్ఛం ఇచ్చి.. అభినందించారు. దరిశిలోని పొదిలి


జశ్వంత్‌కుమార్‌ను అభినందిస్తున్న బూచేపల్లి

రోడ్‌లో అఖిల హెూమ్స్‌లో పాలెం అంజిరెడ్డి నూతన స్వగృహం నిర్మించగా గృహప్రవేశానికి బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి జస్వంత్‌కుమార్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే బాలకార్మికులు ఎక్కువ

- అసంఘటిత కార్మికులందరూ 'ఈ శ్రమ్'కు అర్హులు
- జిల్లాలోని కార్మికులు గుర్తింపుకార్డులు పొందాలి
- జిల్లా కార్మికశాఖ అధికారి శివప్రసాద్





ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఉన్న కార్మికులందరూ ఈ శ్రమ్, మరియు భవన నిర్మాణ కార్మికులుగా తమ పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డు పొందాలని, 16 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలు లోపు ఉన్న అసంఘటిత కార్మికులు అందరూ ఈ శ్రమ్ కార్డును పొందడానికి అర్హులని జిల్లా కార్మికశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. ఎవరైతే 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలలు పాఠశాలకు వెళ్ళడం లేదో వారందరినీ బాల కార్మికులుగా భావిస్తామన్నారు. బాల కార్మికులు పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నారని తెలిపారు. జిల్లా కార్మికశాఖ ద్వారా కార్మికులకు అందుబాటులో ఉన్న చట్టాలు, ప్రయోజనాలు వాటిని పొందాల్సిన ఆవశ్యకత గురించి జిల్లా కార్మికశాఖ అధికారి శివప్రసాద్ 'ప్రజాశక్తి'కి వివరించారు.

జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులందరూ గుర్తింపు కార్డులు పొందడం ద్వారా అందుబాటులో ఉన్న కార్మిక ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. ఈ కార్డు పొందేందుకు తమ ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ ఫస్ట్ పేజీ జిరాక్స్ మరియు ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో కార్మిక శాఖ ఆఫీసు లేదా ఈ సేవ ద్వారా గానీ గుర్తింపు కార్డు పొందవచ్చు. ఈ కార్డు ద్వారా సామాజిక భద్రత మరియు ఇన్సూరెన్స్ కల్పించబడతాయి. ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో ఈ శ్రమ్ కార్డులు 2,30,921 మంది పొందారు. ఇంకా 2,49,859 మంది గుర్తింపు కార్డు పొందవలసి ఉంది. భవన నిర్మాణ కార్మికులుగా ఈ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు భవన నిర్మాణ కార్మికునిగా గుర్తింపు కార్డు పొందాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటివరకు జిల్లాలో సుమారుగా 90,153 మంది గుర్తింపు కార్డు పొందారు. 2009 నుండి 2014 వరకు గుర్తింపు కార్డు పొందినవారు వారు విధిగా ఆధార్ సీడింగ్ చేయించుకోవలసి ఉంది. ఆధార్ సీడింగ్ చేయించుకోని వారు ఆధార్ కార్డు తీసుకొని సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంకు వచ్చి ఆధార్ సీడింగ్ చేయించుకోవలసి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వైయస్సార్ బీమాలో పేర్లు నమోదు చేయించుకున్న భవన నిర్మాణ కార్మికులుగా ఉన్నవాళ్లు వాళ్ళ పేర్లను భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకొని గుర్తింపు కార్డును పొందాలి. వివరాలను కార్మిక శాఖ కార్యాలయంలో పొందవచ్చు.

కనీస వేతన చట్టం ద్వారా వివిధ రకాల సంస్థలలో, దుకాణాల్లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు వేతనం పెంచాలి. ఏప్రిల్ నెల మరియు అక్టోబర్ నెలల్లో యజమానులు దాన్ని గుర్తించి వారి దగ్గర పనిచేసే వారికి ప్రభుత్వం నిర్దేశించిన జీతం ఇవ్వవలసి ఉంది. లేనట్లయితే వ్యత్యాసంను బట్టి క్లైమ్ చేయబడుతుంది.

బాల కార్మికుల నిషేధం మరియు నియంత్రణ చట్టం ప్రకారం 14 సంవత్సరాల వయస్సు నిండని పిల్లలు పనిచేయటాన్ని ఈ చట్టం నిషేధిస్తుంది. బాల కార్మిక నిరోధ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న దుకాణాలు మరియు సంస్థల్లో 14 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరం. అలా పిల్లలతో పని చేయిస్తే యజమానులపై సెక్షన్ 3 కింద మరియు రూ.20 వేల ఫిక్సెడ్ డిపాజిట్ మరియు జీతాల వ్యత్యాసంకు మినిమం వేజ్ యాక్ట్ కింద జరిమానా వేస్తారు. యజమానులు ఎవరూ 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదు.